

8న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మార్చి ఎనిమిదో తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా పెదవేగి మండలం కొప్పాక గ్రామంలోని హైస్కూల్ విద్యార్థులకు గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి సమాన హక్కులు, సమాన బాధ్యతలు, సమాన న్యాయాన్ని కల్పించిందని, ఈ సమాన న్యాయం అందరికీ అందుబాటులో ఉండటానికి ఆర్థికంగా వెనుకబడిన, అవసరమైన భారత పౌరులకు ఉచిత న్యాయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు అందిస్తున్నాయని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీయోగ్యమైన అన్ని కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ స్థానిక శనివారపుపేటలోని బాలుర వసతి గృహాన్ని సందర్శించారు.

'కల్తీ' కాటు..!

ఆహార కల్తీని పట్టించుకోని ప్రభుత్వం
రోగం మూలాలు వదిలేసి ఇతర అంశాలపై హడావుడి
హోటళ్లు, స్ట్రీట్‌ఫుడ్, వంటనూనె నిత్యావసరాలతో సహా అన్నీ కల్తీమయం
ఫుడ్ కలర్స్, టేస్టింగ్ కోసం కలిపే అనేక వాటితో వేగంగా జబ్బులు
కేన్సర్ కేసుల పెరుగుదలలో ఆహార కల్తీనే ప్రధానం
ఫుడ్ సేఫ్టీ శాఖ ఉన్నట్టా... లేనట్టా..
40 మంది ఉండాల్సిన చోట ఒకే ఒక్క అధికారి
తనిఖీలు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా కల్తీ వ్యాపారం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కేన్సర్ నుంచి అనేక రకాల రోగాలు వేగంగా పెరుగుదలకు కారణం ఆహారపు కల్తీనే అని స్పష్టంగా తెలుస్తోంది. ఆహార కల్తీని ఆరికట్టి ప్రజలు రోగాల బారిన పడకుండా కాపాడాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. జబ్బులకు మూలమైన ఆహార కల్తీని పట్టించుకోకుండా ఇతర అంశాలపై పాలకులు చేస్తున్న హడావుడి చూసి అందరిలోనూ అసహనం వ్యక్తమవుతోంది. రోగం రాకుండా చర్యలు తీసుకోవడం మాని, రోగం వచ్చిన తర్వాత ఏం చేయాలనే దానిపై ప్రభుత్వాలు ముందుకు సాగుతున్న పరిస్థితి నెలకొంది. రోగాలబారిన పడుతున్న జనం సరైన వైద్యం అందక, ఆర్థికంగా తట్టుకోలేక ఎంతోమంది ప్రాణాలు విడుస్తున్నారు. రెండు జిల్లాల్లో కేన్సర్ వంటి ప్రమాదకర కేసుల పెరుగుదల వెనుక ఆహార కల్తీనే ప్రధాన పాత్ర పోషిస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఆహార కల్తీని అరికట్టాల్సిన ఫుడ్ సేఫ్టీ శాఖ జిల్లాలో ఉన్నా లేనట్టేనని చెప్పొచ్చు. ఏలూరు జిల్లాలో హోటళ్లు, స్ట్రీట్ ఫుడ్ సెంటర్లు వంటివి దాదాపు ఎనిమిది వేల వరకూ ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో లైసెన్స్ పొందినవి కేవలం రెండు వేలు మాత్రమే ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నిబంధనల ప్రకారం ఆహార కల్తీని అరికట్టాలంటే పట్టణాల్లో లక్ష మంది జనాభాకు, గ్రామాల్లో 50 వేల మంది జనాభాకు ఒకరు చొప్పున ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఉండాలి. నిబంధనల ప్రకారం ఏలూరు జిల్లాలో ప్రధాన అధికారి కాకుండా 40 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను నియమించాల్సి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఇదేవిధంగా నియామకాలు జరగాలి. ఏలూరు జిల్లాలో ప్రధాన అధికారి కాకుండా తనిఖీలు చేసే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఒకేఒక్కరు ఉన్నారు. పశ్చిమలోనూ ఒక అధికారినే పని చేస్తున్నారు. ఫుడ్‌సేఫ్టీ (ఆహార భద్రత, ప్రమాణాలు) శాఖ ఎందుకు ఉన్నట్లో ఏఒక్కరికీ అర్థంకాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ఎంత ప్రాముఖ్యతను ఇస్తుందో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు.

కల్తీని అరికట్టడంలో చిత్తశుద్ధి ఏది..?

ఆహార కల్తీని అరికట్టి ప్రజలను రోగాల బారి నుండి కాపాడటంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి అనేది లేకుండాపోయింది. గతేడాది నవంబర్ నుంచి వైద్యఆరోగ్య శాఖ నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షల్లో రెండు జిల్లాల్లోనూ కేన్సర్ అనుమానితుల సంఖ్య పెద్దఎత్తున ఉంది. ఇక కిడ్నీ, బిపి, సుగర్ వంటి దీర్ఘకాలిక రోగులు ఎక్కువగానే ఉన్నారు. ముఖ్యంగా కేన్సర్ కేసుల పెరుగుదలలో ఆహార కల్తీనే ప్రధాన పాత్రగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. హోటళ్ల నుంచి స్ట్రీట్ ఫుడ్ వరకూ ప్రతిచోటా ఫుడ్ కలర్స్, టేస్ట్ కోసం కలుపుతున్న అనేక పదార్థాలు రోగాలకు కారణమవుతున్నట్లు తెలుస్తోంది. వంటనూనె, బొంబాయి రవ్వ, చపాతి పిండి, టీ పొడి, పంచదార ఇలా ఏదీ కల్తీకి అనర్హం కాదన్నట్లు పరిస్థితి తయారైంది. నిత్యం ఉరుకులు, పరుగుల జీవితంలో ఎక్కువ మంది బయటి ఆహారాన్ని అత్యధికంగా ఉపయోగిస్తున్నారు. దీంతో రోగాల బారిన పడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి మాట్లాడుతూ జీవన శైలి, ఆహారపు అలవాట్లు మారాలని, రైతులు పండించే పంటల్లోనూ మార్పులు రావాలని చెప్పుకొచ్చారు. కీలకమైన ఆహార కల్తీ గురించి మాత్రం మాట్లాడలేదు. నిత్యం తనిఖీలు చేస్తే తప్ప ఆహార కల్తీని అరికట్టడం సాధ్యం కాదు. ఫుడ్‌సేఫ్టీ శాఖలో సిబ్బంది లేకుండా తనిఖీలు ఏవిధంగా జరుగుతాయో ప్రభుత్వమే చెప్పాలి. తనిఖీలు లేకపోవడంతో ఆహార కల్తీ ఇష్టారాజ్యంగా సాగుతోంది. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రోజురోజుకీ రోగుల సంఖ్య పెరిగిపోతుంది. పాలకులు ఇప్పటికైనా ఆహార కల్తీపై దృష్టి సారించి ప్రజలను రోగాల బారి నుంచి కాపాడాల్సిన పరిస్థితి ఉంది.

గ్రూప్-2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ వెట్రిసెల్వి




మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 23న జరిగే గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఏలూరు కలెక్టరేట్‌లోని విసి సమావేశం మందిరంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి ఆయా శాఖల అధికారులతో గ్రూప్-2 పరీక్ష నిర్వహణపై ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 23న రెండు పేపర్లు ఉంటాయని, ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు మొదటి పేపర్ ఉంటుందని, మధ్యాహ్నం మూడు గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు రెండో పేపర్ నిర్వహిస్తారని తెలిపారు. అభ్యర్థులను ఉదయం 8.30 గంటల నుంచి 9:30 గంటల వరకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని, 9.45 గంటల తర్వాత గేట్లు మూసివేస్తారని, ఆలస్యంగా వస్తే అభ్యర్థులను అనుమతించబోరని స్పష్టం చేశారు. మధ్యాహ్నం పరీక్షకు 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారన్నారు. పోలీస్ నోడల్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఈ గ్రూప్-2 పరీక్షకు జిల్లాలో ఆరు కేంద్రాల్లో 4,415 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. శాఖాపరమైన అధికారులు, సమన్వయ అధికారులు చేయాల్సిన పనులపై కలెక్టర్ వివరించారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ వస్తువులతో రాకూడదన్నారు. అభ్యర్థుల సౌకర్యార్థం ఈ నెల 21 నుంచి ఏలూరు కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తారన్నారు. జాయింట్ కలెక్టర్ పరీక్షల కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా నిర్వహించాలని సంబంధిత అధికారులను, పోలీస్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ఎఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, లైజన్ అధికారులు, డిపార్టుమెంట్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ గెలల ఏరివేతపై రైతుల ఆగ్రహం

ఆయిల్‌ఫెడ్ కర్మాగారం ముందు ధర్నా
కొత్త కర్మాగారం నిర్మాణం చేపట్టాలి



వినతి అందిస్తున్న నేతలు, రైతులు

ప్రజాశక్తి - పెదవేగి

గ్రేడింగ్ పేరుతో రైతులు తెచ్చిన ఆయిల్ పామ్ గెలల ఏరివేత ఆపాలని, రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, ఆయిల్‌పామ్ రైతుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆయిల్ ఫెడ్ కర్మాగారం వద్ద గురువారం ఆయిల్‌పామ్ రైతులు ధర్నా నిర్వహించారు. గ్రేడింగ్ పేరుతో ఏరివేసిన గెలలతో నిరసన వ్యక్తం చేశారు. తొలుత రైతుసంఘం నాయకులు ఏరివేసిన గెలలను పరిశీలించారు. ఈ ధర్నానుద్దేశించి ఏపి రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పాత మిషనరీతో ఆయిల్‌ఫెడ్ కర్మాగారం నడుపుతున్నారని, రికవరీ శాతం పెంచాలనే పేరుతో పక్వానికి వచ్చిన గెలలను సైతం ఏరివేయడం తగదన్నారు. నూతన టెక్నాలజీ మిషనరీతో కొత్త ఫ్యాక్టరీ నిర్మించకుండా పాత మిషనరీతో రికవరీ శాతం పెంచడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. రైతులు నష్టపోకుండా దర్జాలు ఏరివేయకుండా చూడాలని కోరారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కొత్త ఆయిల్ ఫెడ్ కర్మాగారం నిర్మాణానికి నిధులు కేటాయించి ఆయిల్‌పామ్ రైతులను ఆదుకోవాలన్నారు. ఆయిల్‌పామ్ రైతులు బొల్లు రామకృష్ణ, మన్నె బాబూరావు మాట్లాడుతూ పెట్టుబడి ఖర్చులు పెరిగిపోయాయని, దిగుబడి రావడం లేదని చెప్పారు. ఆయిల్‌పామ్ గెలల ధర కొంత పెరిగిందని రైతులు సంతోషిస్తున్న ఈ సమయంలో దిగుబడి రాక నష్టపోతున్నామని, పైగా గెలలు గ్రేడింగ్ పేరుతో ఏరివేయడంతో మరింతగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయిల్‌ఫెడ్ యాజమాన్యం స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఆయిల్‌ఫెడ్ మేనేజర్ సుధాకర్‌తో రైతుసంఘం నాయకులు ఫోన్లో సంప్రదించగా సమస్య పరిష్కరిస్తామని, రైతులతో చర్చలు జరుపుతామని హామీ ఇచ్చారు. ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. అధికారుల హామీతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో పెదవేగి, లింగపాలెం మండలాలకు చెందిన ఆయిల్‌పామ్ రైతులు తాతినేని రమేష్, బొప్పన పూర్ణచంద్రరావు, బి.మురళి, జాస్తి ధర్మారావు, ఎన్.శ్రీనివాసరావు, బి.రామచంద్రరావు, మంతెన జగన్నాథం, ...రావు, బి.వీరవెంకటసుబ్బారావు, గుడిబండి రమేష్‌రెడ్డి, పలువురు ఆయిల్‌పామ్ రైతులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపించండి

ఎంఎల్‌సిలు గోపీమూర్తి, ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) ముమ్మర ప్రచారం



చింతలపూడిలో...

ప్రజాశక్తి - చింతలపూడి

ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులును గెలిపించాలని ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో ఆయన గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడే శక్తి పిడిఎఫ్ అభ్యర్థులకు మాత్రమే ఉందన్నారు. స్వలాభం కోసం కాకుండా ప్రజా సంక్షేమం కోసం పాటుపడే అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడంలో ... ఈ పరిస్థితుల్లో ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపించాలని ప్రజాసంఘాల నేత తెల్లం దుర్గారావు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని దర్భగూడెం, జీలుగుమిల్లి తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు జానకిరామిరెడ్డి, కొండలరావు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీరరాఘవులుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అన్నారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, ప్రయివేటు విద్యాసంస్థలు, దేవస్థాన ఉద్యోగులను కలిసి డి.వి.రాఘవులుకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ప్రజా గొంతుక శాసనమండలిలో వినిపించేలా పట్టభద్రులు విజ్ఞత ప్రదర్శించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

భీమడోలు: ఉపాధ్యాయ, ఉద్యోగ, అధ్యాపక, కార్మిక, ప్రజాసంఘాలు బలపర్చిన పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రులు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) కోరారు. భీమడోలులోని శ్రీ విష్ణు విద్యాసంస్థలు, ఏలూరుకెరీ ఇంజనీరింగ్ కళాశాల, డిఎన్ఆర్ కళాశాలల్లో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపించాలని కోరుతూ గురువారం ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులు, అధ్యాపకులను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఐవి మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగ, నిరుద్యోగుల సమస్యలు, సంక్షేమంపై గత 17 ఏళ్లుగా పిడిఎఫ్‌కు చెందిన 16 మంది ఎంఎల్‌సిలు వాణి వినిపించారన్నారు. డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్స్ తరపున ప్రభుత్వాలను నిలదీశామన్నారు. ఆయా తరగతుల వారి సంక్షేమం, సమస్యల పరిష్కారానికి పని చేశామన్నారు. ప్రధానంగా ఉద్యోగుల పక్షాన నిలబడి రావాల్సిన డిఎలు, పిఆర్‌సి బకాయిలు, సిపిఎస్ రద్దు కోసం శాసనమండలిలోనూ, బయటా పోరాటం చేశామన్నారు. ఉపాధ్యాయునిగా, జెవిసి నాయకునిగా 35 ఏళ్లపాటు ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై జరిగిన పోరాటాల్లో సేవలందించిన దిడ్ల వీర రాఘవులు పోటీ చేస్తున్నారన్నారు. ఈ నెల 27న జరిగే పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లో 14వ నెంబర్‌లో ఉన్న దిడ్ల వీర రాఘవులు పేరు ఎదురుగా ప్రథమ ప్రాధాన్యత ఓటుగా 1వ నెంబర్ వేసి గెలిపించాలని కోరారు. పెదరేపన్ నాయకులు మాట్లాడుతూ ఇళ్ల వెంకటేశ్వరరావు గత ఐదేళ్లు ఆదర్శంగా పని చేశారన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సిగా పని చేసిన ఆయన మళ్లీ తాను పోటీ చేయకుండా స్వచ్ఛందంగా తప్పుకుని, దిడ్ల వీరరాఘవులకు అవకాశం కల్పించారన్నారు. నిరాడంబరంగా ఉండడానికి సహాయకులను, గన్‌మెన్‌లను పెట్టుకోలేదన్నారు.

నరసాపురం: గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) కోరారు. గురువారం నరసాపురంలో పలు విద్యాసంస్థలు, నివాస ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐవి శాసనమండలిలో నిరుద్యోగులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజల సమస్యలపై పోరాడేది పిడిఎఫ్ సభ్యులేనన్నారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేని కూటమికి ఈ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు లేదన్నారు. మేధావుల సభగా పేరొందిన శాసనమండలికి రాజకీయ నిరుద్యోగులను పంపొద్దని ఆయన కోరారు.



నరసాపురంలో...

ఎంఎల్‌సిగా కెఎస్.లక్ష్మణరావును గెలిపించాలి

మాజీ ఎంఎల్‌సి బొడ్డు నాగేశ్వరరావు



ముసునూరులో..

ప్రజాశక్తి - ముసునూరు

కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో కెఎస్.లక్ష్మణరావును గెలిపించాలని మాజీ ఎంఎల్‌సి బొడ్డు నాగేశ్వరరావు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన గురువారం ప్రచారం నిర్వహించారు. ఉద్యోగ ఉపాధ్యాయులను కలిసి ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావును గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రజల తరపున పోరాడటంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు. అందరూ కెఎస్.లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు, మండల నాయకులు కొడవలి శ్రీనివాస్, శివప్రసాద్, రమేష్, దుర్గారావు, శ్రీను పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సిగా కెఎస్.లక్ష్మణరావును గెలిపించాలని మాజీ ఎంఎల్‌సి బొడ్డు నాగేశ్వరరావు కోరారు. పట్టణ పరిధిలోని త్రివిధ విద్యాసంస్థల ఆవరణంలో గురువారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌సి బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో ఎన్నికల క్యాంపైనింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సిగా కెఎస్.లక్ష్మణరావును గెలిపించాలని కోరారు. ఎంతో అనుభవశాలి, అవినీతి రహిత నేతగా అన్ని తరగతుల ప్రజల మన్ననలు పొందిన కెఎస్.లక్ష్మణరావు గెలుపు అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద మలుపు కాగలదన్నారు. ప్రస్తుత సమాజంలోని పరిస్థితులను చక్కబెట్టేందుకు, అభివృద్ధికి దోహదపడే పలు సంస్కరణల అమలు కోసం కెఎస్.లక్ష్మణరావు గెలుపు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అందరూ కెఎస్.లక్ష్మణరావుకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జి.రాజు, ఎన్ఆర్ హనుమాన్లు, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



నూజివీడులో...

ఆప్కాస్‌ను రద్దు చేయొద్దు

22న మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు
మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు)



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ కార్పొరేషన్ (ఆప్కాస్)ను రద్దు చేస్తే ఆప్కాస్ ఉద్యోగులందరిని పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య డిమాండ్ చేశారు. ఆప్కాస్ ఉద్యోగులను ప్రయివేట్ ఏజెన్సీలు, కాంట్రాక్టర్లకు అప్పజెప్పవద్దని, దీనిపై దశలవారి ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు. దశలవారి ఆందోళనకు సంబంధించిన కరపత్రాలను కమిటీ సభ్యులతో కలిసి గురువారం పవర్‌పేట సిఐటియు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ ఈ నెల ఆరో తేదీన జరిగిన మంత్రివర్గం రాష్ట్రంలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ కార్పొరేషన్(ఆప్కాస్)ను రద్దు చేసి ఉద్యోగులను 2019కు ముందు పాత పద్ధతిలో ప్రయివేట్ ఏజెన్సీలు, కాంట్రాక్టర్లకు అప్పజెప్పాలని నిర్ణయించిన నేపథ్యంలో దీనిని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) తీవ్రంగా నిరసించిందన్నారు. ఆప్కాస్‌లో రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది ఉద్యోగులు ఉన్నారని, ఈ లక్ష మంది ఉద్యోగులకు ఆప్కాస్‌లో ఉండడం వల్ల గత ఐదేళ్లుగా ప్రతినెలా ఒకటో తేదీన జీతం వస్తుందని, పిఎఫ్, ఇఎస్ఐలు సకాలంలో జమ చేస్తున్నారని, చట్ట ప్రకారం కనీస వేతనాలు అమలవుతున్నాయని తెలిపారు. ఉద్యోగులకు ఎంతో కొంత మేలు చేసే ఆప్కాస్‌ను రద్దు చేసి మళ్లీ ప్రయివేట్ ఏజెన్సీలు, కాంట్రాక్టర్లకు అప్పజెప్పినట్లైతే ఉద్యోగులకు రెండు, మూడు నెలలకొకసారి జీతాలు వచ్చే అవకాశం ఉంటుందని, పిఎఫ్, ఇఎస్ఐలు సకాలంలో జమ చేయరని, కనీస వేతనాలు అమలు చేయరని, దానివల్ల ఆప్కాస్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని చెప్పారు. ఆప్కాస్‌ను కొనసాగించాలని లేదా ఆప్కాస్ ఉద్యోగులందరిని పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 22వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర అధ్యక్షులు లావేటి కృష్ణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి అంగులూరి జాన్ బాబు, బంగారు వెంకటేశ్వరరావు, బంగారు రమేష్, జయకుమార్, తానంకి జార్జి, పి.విష్ణు, పి.నాగరాజు, బండి రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆటోస్టాండ్ తొలగింపు దారుణం

ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన నిరసన



నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఉన్న ఆటో స్టాండ్‌ను గత మంగళవారం ఎటువంటి సమాచారం లేకుండా తొలగించడాన్ని ఏలూరు జిల్లా ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి జె.గోపీ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ ఆఫీస్ సెంటర్ ఆటోస్టాండ్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో గోపీ మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా ఏలూరు నగరం నుంచి పరిసర గ్రామాలకు ప్రయాణికులను చేరవేస్తూ తద్వారా వచ్చే ఆదాయాలతో కుటుంబ పోషణ చేసుకుంటున్న దాదాపు 300 మంది ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఈ ఆటో స్టాండ్ తొలగించడం ద్వారా రోడ్డున పడేశారని విమర్శించారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు చక్రాల అమర్‌కుమార్ మాట్లాడుతూ కాకులను తోలి గద్దలకు పంచే చందంగా ఏలూరు నగరపాలక సంస్థ తీరు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బడుగు బలహీన తరగతులకు చెందిన దాదాపు 300 ఆటో డ్రైవర్ల కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి చూపించాల్సిన ప్రభుత్వాలు పరిశ్రమలు మూతపడుతున్నా మాట్లాడటం లేదని, స్వయం ఉపాధిగా జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లపై బలవంతుల కన్ను పడిందని, దీనికి ప్రభుత్వం కొమ్ముకాస్తోందని విమర్శించారు. నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎ.రాజు, బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు యధావిధిగా మున్సిపల్ ఆఫీస్ సెంటర్‌లో ఉన్న ఆటో పార్కింగ్ స్టాండ్‌ను కొనసాగించాలని, లేకపోతే నగరంలో ఉన్న ఆటో డ్రైవర్లందరిని సమీకరించి భవిష్యత్తు ఉద్యమాలకు సిద్ధమవుతామని, దానికి నగరపాలక సంస్థ, ప్రభుత్వ పెద్దలు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నిరసన కార్యక్రమం అనంతరం ఏలూరు నగర కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబుకు వినతిపత్రం అందించారు. ఈ నిరసన కార్యక్రమంలో కల్లూరి రాజారావు, పడమట సుందర్రావు, వైష్ణవ్, సందీప్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన

రైతులతో పెగాసస్ క్యాపిటల్ ప్రతినిధుల పరస్పర చర్చలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ (ఎపిసిఎన్ఎఫ్) కార్యక్రమాన్ని బలోపేతం చేయడం కోసం రాష్ట్రంలో చేపడుతున్న పర్యటనలో భాగంగా అమెరికాకు చెందిన పెగాసస్ క్యాపిటల్ ప్రతినిధుల బృందం గురువారం ఉంగుటూరు మండలంలోని ఎ.గోకవరం, భీమడోలు మండలంలోని వడ్లపట్ల, కోడూరుపాడు గ్రామాలను సందర్శించింది. ఈ బృందంలో వైట్ హౌస్ జాతీయ వాతావరణ మాజీ సలహాదారు గీనా మెకార్తీ, పెగాసస్ క్యాపిటల్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్, సిఇఒ క్రేగ్ కాట్, ప్రొడ్యూసర్స్ సంస్థ వ్యవస్థాపకుడు, సిఇఒ కీత్ అగోడా ఉన్నారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి.విజయ్‌కుమార్ నేతృత్వంలో జరిగిన క్షేత్ర పర్యటనలో భాగంగా బృంద సభ్యులు తొలుత ఎ.గోకవరం గ్రామంలోని సురభి గోశాలను సందర్శించి ప్రకృతి వ్యవసాయ తొమ్మిది సార్వత్రిక సూత్రాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో అనుసరిస్తున్న విత్తన గుళికల తయారీ, ఘన జీవామృతం, అగ్నాస్త్రం వంటి విధానాలను గమనించారు. అనంతరం టి.మల్లేష్ పొలంలో ఎటిఎం మోడల్‌తో పాటు నీటితో ప్రయోగాత్మకంగా వివిధ వ్యవసాయ విధానాల్లో బియ్యం ఉత్పాదకతను విశ్లేషించారు. ఆ తర్వాత భీమడోలు మండలంలోని కోడూరుపాడు గ్రామంలో ఎపిసిఎన్ఎఫ్ మెంటార్ ఇంటర్న్ కె.కళ్యాణ్ కుమార్ అమలు చేసిన ఎ-గ్రేడ్ ప్రకృతి వ్యవసాయ నమూనాను రసాయన పద్ధతిలో వ్యవసాయం చేసే ఎన్.రాంబాబు పొలంతో పోల్చి రెండింటికీ మధ్య గల వ్యత్యాసాన్ని గమనించారు. అనంతరం బృందం సభ్యులు యు.రామచంద్రరావుకు చెందిన ఎనిమిది ఎకరాల కొబ్బరి తోటను సందర్శించారు. కొబ్బరి తోటలో వేసిన అరటి, వక్క, కూరగాయల వంటి అంతర పంటలను రసాయన ఆధారిత వ్యవసాయం చేసే ఎన్.రాంబాబు పొలంతో పోల్చి చూశారు. అనంతరం ప్రతినిధుల బృందం కృష్ణ రాఘవ ప్రకతి వనరుల కేంద్రాన్ని సందర్శించారు. ఈ కేంద్రం ద్వారా ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్‌కు అవసరమైన బహుళ పంటల విత్తన కిట్లు, ఇతర వ్యవసాయ ముడిపదార్థాలను అందుబాటులో ఉంచడం ద్వారా ప్రకృతి వ్యవసాయ రైతులకు అవసరమయ్యే వనరులను అందించడం పట్ల అభినందనలు తెలిపారు. భీమడోలు మండలంలోని వడ్లపట్ల గ్రామంలో శ్రీనివాస స్వయం సహాయక సంఘం సభ్యులు, స్థానిక రైతులతో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ పొలాల్లో డ్రోన్ సహాయంతో జీవ ఉత్ప్రేరకాలను స్ప్రేయింగ్ చేసే విధానం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు అరుణ, ప్రభాకర్, విషి, ఎపిసిఎన్ఎఫ్ జిల్లా మేనేజర్ తాతారావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శిస్తున్న బృందం

ప్రథమ చికిత్సా నిర్వాహకులు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రథమ చికిత్సా నిర్వాహకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని డిఎంఇ డాక్టర్ నాగేశ్వరరావు సూచించారు. ప్రథమ చికిత్స నిర్వాహకులకు అవగాహనా సదస్సును జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంఇ డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రథమ చికిత్స నిర్వహించేవారు తప్పకుండా ప్రథమ చికిత్స కేంద్రం రిజిస్టర్ నెంబర్, సమయం, తదితర అంశాలను బోర్డులో పొందుపరచాలని తెలిపారు. గ్రామీణ వైద్యులు ప్రజలకు చేరువలో ఉండి ప్రథమ చికిత్స చేసి ప్రమాదం నుంచి కాపాడి సుక్షితంగా వైద్యం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎంపి అసోసియేషన్ ప్రెసిడెంట్ శివరామకృష్ణ, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ గోవిందరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దెందులూరు మండలం ముప్పవరం గ్రామంలో ఉన్న నాగ హనుమాన్ ఆయిల్ సాల్వెంట్‌లో బుధవారం జరిగిన ప్రమాదంలో గాయాలపాలైనవారి కుటుంబాలను తక్షణమే ఆదుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇద్దరు కార్మికుల పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించడం ఆందోళనకరమని తెలిపారు. యాజమాన్యం ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవడంలో విఫలమవ్వడం వల్లే పదేపదే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ప్రమాదంలో గాయపడిన కార్మికులకు పూర్తిస్థాయి వైద్యం యాజమాన్యం అందించాలని పేర్కొన్నారు. వారి కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత కూడా ఉంటుందని తెలిపారు. ఇలాంటి ప్రమాదాలు రానున్న కాలంలో జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ట్రిపుల్ ఐటి విద్యార్థులకు పరుపుల పంపిణీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌లో ఆర్‌పియుసి మొదటి సంవత్సరం విద్యార్థులకు పరుపులు పంపిణీ చేశారు. క్యాంపస్ డైరెక్టర్, రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణరావు, డీన్ అకాడమిక్ డాక్టర్ చిరంజీవి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రాజశేఖర్ మాట్లాడారు. అనంతరం మెస్ హాల్స్‌ను సందర్శించి ఆహార పదార్థాలు, వంట ప్రక్రియను పర్యవేక్షించి, రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

నేరాలు - ఘోరాలు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఆటో

ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రయాణికుల ఆటో విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ఐదుగురు గాయాలపాలయ్యారు. ఏలూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఏలూరు నగరం నుంచి ఒక ఆటో ఐదుగురు ప్రయాణికులతో కైకలూరు వైపు వెళ్తుంది. లింగారావుగూడెం సమీపానికి చేరుకునే సరికి ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్‌స్తంభాన్ని బలంగా ఢీ కొట్టింది. స్తంభం ఆటోపై పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న శ్రీపర్రు గ్రామానికి చెందిన జయ మంగళ సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. అతనితో పాటుగా మరో నలుగురికి గాయాలయ్యాయి. వెంటనే వీరిని 108 వాహనంలో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్‌బియ్యం లారీ చోరుల అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

290 బస్తాల బియ్యం లారీని అపహరించుకుపోయిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి శ్రావణ్‌కుమార్ గురువారం సాయంత్రం ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్లో విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నగరానికి చెందిన లారీ ఎపిసివి గోడౌన్ వద్ద 290 బస్తాల బియ్యంతో గత నెల 29వ తేదీన నిలిపి ఉంచారు. గుర్తుతెలియని ఆ లారీని బియ్యంతో సహా దానికి ఉన్న జిపిఎస్ ట్రాకర్‌ను వదిలేసి అపహరించుకుపోయారు. ఆదేరోజు లారీ యజమాని ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం ఏలూరు రూరల్ పరిధిలో ముగ్గురు వ్యక్తులు లారీలో ఉన్న బియ్యాన్ని అమ్ముతూనికి ప్రయత్నిస్తున్నారన్న సమాచారాన్ని అందుకున్న ఏలూరు వన్‌టౌన్ సర్కిల్ సిఐ సత్యనారాయణ, రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ సంయుక్తంగా అక్కడ దాడి చేసి లారీని, లారీలో ఉన్న బియ్యాన్ని, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు వారిని విచారించగా ఈ కేసులో ఏలూరు రూరల్ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన జెన్నూరుల్ సుధాకర్‌ను నిందితుడిగా గుర్తించారు. ఇప్పటికే ఇతనిపై రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులు పలు సంఖ్యలో ఉన్నట్లు తెలిపారు. పెదపాడు మండలం ఆదె గ్రామానికి చెందిన దూడల దిరాజు, కొల్లేపు మణికంఠలు ఇతనికి సహకరించారు. ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు.

కుమారుడు కన్పించడం లేదని తండ్రి ఫిర్యాదు

ప్రజాశక్తి - టి.నరసాపురం

కుమారుడు కనిపించడంలేదని తండ్రి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వల్లంపట్ల పంచాయతీలోని శింగరాయపాలెం గ్రామానికి చెందిన జువ్వా దుర్గారావుకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్న దుర్గారావు జూదం వంటి వ్యసనాలకు బానిసయ్యాడు. చేసిన అప్పులు తీర్చాలని తండ్రికి, భార్యకు చెప్పి బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 19న ఉదయం మోటారు సైకిల్‌పై జంగారెడ్డిగూడెం వెళ్లి తిరిగి రాలేదు. దుర్గారావు బావ గ్రామానికి చెందిన తలపనేని పవన్‌కు ఫోన్ చేసి మోటారు సైకిల్ తీసుకెళ్లమని చెప్పాడు. ఆదేరోజు రాత్రి సుమారు 11:30 గంటలకు నాకు అప్పులు ఎక్కువగా ఉన్నాయి. జూదం మానలేకపోతున్నాను. నన్ను వెదకవద్దు అని అతని తల్లికి, బావ శివలకు మెసేజ్ పెట్టి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో కుటుంబసభ్యులు బంధువుల ఇళ్ల వద్ద, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో దుర్గారావు తండ్రి సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జామాయిల్ ట్రాక్టర్ బోల్తా

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని ఆర్అండ్‌బి రోడ్డు నిర్మాణం అస్తవ్యస్తంగా నిలిపివేయడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గురువారం మండల పరిధిలోని అల్లిగూడెంలో జామాయిల్ లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. రోడ్డుకి అడ్డంగా పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని యనమదల గ్రామంలోని నాటుసారా స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ సిహెచ్.అజయ్‌కుమార్‌సింగ్ తెలిపారు. ఈ దాడుల్లో 20 లీటర్ల నాటుసారా, స్కూటీని స్వాధీనం చేసుకుని, సిద్ధార్థనగర్‌కు చెందిన లావూరి వెంకట శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ భోగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి : నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పట్టణ పరిధిలో ఉన్న ఒద్దుగూడెంలో దాడులు చేయగా గ్రామానికి చెందిన మారేశ్వరరావును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఏలూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్‌ఫోర్స్ టీమ్ ఎస్ఐ మహమ్మద్ ఆరిఫ్ తన సిబ్బందితో రామవరప్పాడు గ్రామంలో దాడి చేశారు. ఈ దాడిలో రాంబాబును, అతనికి నాటుసారా సరఫరా చేసే నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన భూక్య శ్రీనును అరెస్టు చేసి వారి వద్ద నుంచి 25 లీటర్ల నాటుసారాను, సారా రవాణా చేసేందుకు ఉపయోగిస్తున్న బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాఘవాపురం గ్రామానికి చెందిన ఇంజమూరి రాంబాబును పాత కేసులో తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

క్షయ పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - చాట్రాయి

క్షయ నివారణ వారోత్సవాలను చాట్రాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ఎం.జ్యోతి మాట్లాడుతూ కఫం ద్వారా టిబి వ్యాధిని నిర్ధారించే ట్రూ నాట్ ఎంటిబి టెస్ట్ పిహెచ్‌సి లేబరేటరీలో అందుబాటులో ఉందన్నారు. అశ్రద్ధ చేసినా, మందులు అసంపూర్తిగా వాడినా మొండి క్షయ వ్యాధిగా మారుతుందని, దీనికి మళ్లీ డ్రగ్ రెసిస్టెంట్ మందులు వాడాల్సి వస్తుందని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - దెందులూరు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. ప్రభాకర్‌ను ప్రజలు గురువారం కలిసి పలు వినతులు అందించారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో గురువారం పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఎంఎల్ఎను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ వినతులు స్వీకరించారు. సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టారు.

ఉద్యోగావకాశాలు కల్పించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అమరావతిని ఫ్రీ జోన్ గా చేసి 26 జిల్లాల నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని అఖిలభారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జిల్లా కో కన్వీనర్ కొల్లిపాటి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక స్ఫూర్తి భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రాజు మాట్లాడారు. అమరావతి ఫ్రీ జోన్ చేసి అక్కడ భర్తీ చేసే ఉద్యోగాల్లో 26 జిల్లాల నిరుద్యోగులకు అవకాశాలు కల్పించి, డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ పోస్టులతో పాటు, గ్రూప్-1, 3 ఉద్యోగాల భర్తీకి ఎపిపిఎస్‌సి ద్వారా ఇయర్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు.

నష్టం లేకుండా రీసర్వే చేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

రైతుకు ఎలాంటి నష్టం, ఇబ్బంది లేకుండా రీ సర్వే చేయాలని తహశీల్దార్ కె.రాజ్‌కుమార్ సర్వే అధికారులకు సూచించారు. మండలంలోని అక్కిరెడ్డిగూడెం గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే ఒక్కొక్క గ్రామంలో 60 రోజులపాటు నిర్వహిస్తూ రైతుకు ఎలాంటి నష్టం లేకుండా చూడాలని సర్వే అధికారులకు సూచించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలంటే పదో తరగతిలో మంచి మార్కులు పొందాలని ప్రధానోపాధ్యాయులు పివిఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఈ స్టడీ మెటీరియల్ శ్రద్ధగా, పూర్తిగా చదివితే ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వాకా నాగరాజు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆర్‌టిసి బస్సును నిర్లక్ష్యంగా, అతివేగంగా నడిపిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం...మండలంలోని కొరగుంటపాలెం చెందిన బందుల విజయసాగర్ భార్యతో కలిసి బైక్‌పై ముదినేపల్లి వస్తున్నారు. ఈ క్రమంలో బంటుమిల్లి నుంచి గుడివాడ వెళ్తున్న గుడివాడ డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు శ్రీహరిపురం ఆంధ్ర బ్యాంక్ వద్ద విజయసాగర్ బైక్‌ను ఓవర్టేక్ చేసి ముందుకు వెళ్లి బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుక ఉన్న బైక్ అదుపు తప్పి బస్సు వెనుక ఢీకొనడంతో విజయసాగర్ రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో విజయసాగర్‌కు గాయాలయ్యాయి. అయితే బస్సు డ్రైవర్ బస్సు ఆపకుండా వెళ్లిపోయాడు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా అతివేగంగా బస్సు నడపడం కారణంగానే తనకు ప్రమాదం జరిగిందని, డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అనుమతుల్లేకుండా పడవలు నడపొద్దు

ప్రజాశక్తి - పోలవరం

మహాశివరాత్రి ఉత్సవాల్లో అనుమతి లేకుండా గోదావరిలో పడవలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ పవనకుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాలు ఈ నెల 25 నుంచి 27 వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలు జరిగే మూడు రోజులు పోలవరం, పట్టిసీమ గూటాల, తాళ్లపూడి పరిసర ప్రాంతాల్లో ప్రయాణికుల రవాణాకు వినియోగించే నాటు పడవలు, ఇసుక పడవలు అనుమతి లేకుండా గోదావరిలో నడపరాదని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

చోరీపై సిఐ విచారణ

ప్రజాశక్తి - ముదినేపల్లి


మండలంలోని వడాలి గ్రామంలో ఇటీవల జరిగిన చోరీపై కైకలూరు రూరల్ సిఐ రవికుమార్ విచారణ నిర్వహించారు. ఈ నెల 16 తేదీ వడాలి గ్రామంలో కె.ప్రసాద్ ఇంటి వద్ద జరిగిన వివాహానికి రాజమండ్రి నుంచి నంబూరి బుజ్జి అనే కుటుంబం హాజరైంది. వీరి వెంట సుమారు రూ.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు తీసుకొచ్చి వాటిని ఒక బ్యాగ్‌లో ఉంచారు. బుజ్జి కుటుంబ సభ్యులు 15 తేదీ రాత్రి పెండ్లి వారి బంధువుల ఇంట నిద్రకు ఉపక్రమించారు. 16వ తేదీ ఉదయం బ్యాగు తెరిచి చూసేసరికి బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై సిఐ రవికుమార్ ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రుడుతో కలిసి పెళ్లి జరిగిన జగన్నాథస్వామి ఆలయం వద్ద, పెళ్లి కుమారుని ఇంటి వద్ద విచారణ చేశారు. పెళ్లి కుమారుని ఇంటి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని ప్రగడవరంలో ప్రధాన రహదారి పక్కన ఆంధ్రా బ్యాంకుకు సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన దిమ్మె ఎత్తు తక్కువగా ఉంది. ఆ పక్కనే దుకాణాల వైపు వెళ్లే వారికి చేతికి అందేలా ట్రాన్స్‌ఫార్మర్ కేబుల్ వైర్లు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో మంటలు రావడం, పెద్ద శబ్దం వచ్చి విద్యుత్ సరఫరా నిలిపిపోవడం వంటివి చోటు చేసుకుంటున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగే లోపు విద్యుత్ శాఖాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

చెరువు అక్రమ వేలంపై విచారణ చేపట్టాలి

పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలి

డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని మైసన్నగూడెం గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 103లో 13 ఎకరాల 70 సెంట్ల ప్రభుత్వ చెరువు అక్రమ వేలంపాట జరిపి నీటి సంఘం పేరుతో పంచాయతీకి రావాల్సిన నిధులను సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత మూడేళ్ల కాలంగా మైసన్నగూడెంలో అక్రమ పద్ధతిలో 13 ఎకరాల చెరువును చేపలకు లీజుకు ఇచ్చి పంచాయతీ నిధులకు గండి కొడుతున్నారని తెలిపారు. ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని, దోచుకున్నవారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఇటీవల ఈ నెల పదో తేదీన పాత వేలం పాట పూర్తవ్వడంతో కొత్త వేలం పాట పాడేందుకు నీటి కట్టు సంఘం కొత్త కమిటీ సభ్యులు వేలం నిర్వహించేందుకు గ్రామంలో మైక్ ప్రచారం చేశారని తెలిపారు. మత్స్య కార్మికులు జీవనోపాధి కోసం వేలం పాడుకునేందుకు పంచాయతీ వద్దకు వెళ్లగా అక్కడ ఉన్న పంచాయతీ అధికారులు తమకు ఎటువంటి సమాచారం లేదని, తమ నుంచిఎ టువంటి పాట నిర్వహించడం లేదని తెలిపారు. పంచాయతీ కార్యదర్శికి, గ్రామ ప్రజా ప్రతినిధి పంచాయతీ సర్పంచికి ఎటువంటి సమాచారం లేకుండా గ్రామంలో ఉన్న కొంతమంది వ్యక్తులు అక్రమ పద్ధతిలో దండోరా వేయడం చట్ట విరుద్ధమని, సంబంధిత అధికారులు ఈ విషయంపై విచారణ చేసి అక్రమ పద్ధతిలో దండోరా వేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు చేయాలని పేర్కొన్నారు. నూకాలమ్మ చెరువు విషయమై గత మూడేళ్లుగా జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయంలో స్పందనలో పలుమార్లు ఫిర్యాదులు ఇచ్చినప్పటికీ పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా గ్రామంలో ఉన్న చెరువును చట్టబద్ధంగా వేలంపాట నిర్వహించి ప్రభుత్వ ధనాన్ని కాపాడాలని, పంచాయతీని ఆర్థికంగా ఆదుకోవాలని పేర్కొన్నారు. లేకపోతే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న మత్స్యకారులను, గ్రామ ప్రజలను ఐక్యం చేసి న్యాయం జరిగేంత వరకు కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యాచరణకు సిద్ధమవుతామని తెలిపారు.

క్షయపై అవగాహనా సదస్సు

కుక్కునూరు :రెండు వారాలకు మించి కఫంతో కూడిన దగ్గు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి పూర్ణ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో క్షయ వ్యాధిపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కఫంతో కూడిన దగ్గు సాయంత్రం వేళల్లో రావడం, జ్వరం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉంటే క్షయ వ్యాధి లక్షణాలుగా గుర్తించాల న్నారు. ఆ లక్షణాలు ఉన్నవారు టీబీ పరీక్ష తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. టిబి నిర్ధారణ అయితే ఆరు నెలలు ఉచితంగా మందులు ఇస్తారని, పోషకాహార నిమిత్తం నెలకు రూ.వెయ్యి వారి బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని తెలిపారు.

గురుకుల పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి - ముసునూరు

రెసిడెన్షియల్ జాయింట్ సెక్రటరీ మహమ్మద్ ఉభుతుల్ ముసునూరు బాలికల గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎస్ఎంసి కమిటీ ఛైర్మన్ సాయిలు పంగిడియ్య, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పాఠశాలలో భోజనం, తర గతి గదులు, ఉపాధ్యాయుల పనితీరు, హాస్టల్ వసతి పలు రికార్డులను పరిశీలించారు. తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలించినట్లు వారు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు సిటీ : కూటమి ప్రభుత్వం మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపుమేరకు ఏలూరు నగర సమితి ఆధ్వర్యంలో గురువారం ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భజంత్రీ శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆప్కాస్ రద్దు పరుస్తూ రాష్ట్ర క్యాబినెట్‌లో ఆమోదించినట్లు పత్రికల ద్వారా వార్తలు వస్తున్న నేపథ్యంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ కార్మికులను క్రమబద్ధీకరించి, ఉద్యోగ, వేతన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అపరిష్కృతంగా ఉన్న మూడేళ్ల సరెండర్ లీవ్, ఎన్ క్యాష్‌మెంట్, మూడు డిఎలు తక్షణమే విడుదల చేయాలన్నారు. రానున్న బడ్జెట్ సమావేశాల్లో ఈ సమస్యలపై అసెంబ్లీలో వివరించాలని శ్రీనివాసరావు కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర కోశాధికారి కసంకోట నాగేంద్ర, పుచ్చ శంకర్, మీసాల చంద్రమౌళి, గోవాడ మల్లేశ్వరరావు, కసింకోట రమణ, అల్లం పెద్దిరాజు, ధనియాల రాజేష్ పాల్గొన్నారు.

అత్యాధునిక టెక్నాలజీ సాయంతో సత్వర ప్రజాసేవలు

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అత్యాధునిక టెక్నాలజీ సాయంతోనే సత్వర ప్రజాసేవలు సాధ్యమని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఇదేక్రమంలో విప్లవాత్మక ఆలోచనతో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుట్టిందన్నారు. ఎంఎల్ఎకు తమ సమస్యలను తెలుపుకునేందుకు ఏలూరులోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయానికి ప్రజలు గురువారం అధికసంఖ్యలో వచ్చారు. వారి సమస్యలను ఎంఎల్ఎ క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కొలువుదీరిన నాటి నుంచి అనేక విప్లవాత్మక నిర్ణయాలతో ముందుకెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి ఎన్నికల ఏలూరు నియోజకవర్గ టిడిపి పరిశీలకురాలు ఆచంట సునీత, కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైకల్యం - నివారణపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - దెందులూరు

దగ్గరి రక్త సంబంధీకులతో (రక్త సంబంధ) వివాహం జరపవద్దని 18 ఏళ్ల లోపు బాల్య వివాహాలు, గర్భధారణ జరగకుండా చూడాలని సిడిపిఒ విజయలక్ష్మి చెప్పారు. ఏలూరు దొండపాడులో ఉన్న ఉమా ఎడ్యుకేషన్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం వారు గురువారం శనివారపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో 2016 వికలాంగుల హక్కుల చట్టంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సిడిపిఒ విజయలక్ష్మి, సంస్థ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రంలో ఫిజియోథెరపీ, ఆడియోలాజీ, సైకలాజీ సేవలు ఉచితంగా అందిస్తామని తెలిపారు. సమాచారం కోసం 08812 -249297, 7386565469 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అంగన్వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు మూడో రోజు జరుగుతున్న జ్ఞానజ్యోతి సర్టిఫికెట్ కోర్స్ శిక్షణ కార్యక్రమంలో ఎంఇఒ జె.సురేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమ ముఖ్య ఉద్దేశం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌పిలు మూర్తి, వజీర్, స్వామి అయ్యప్ప, సూపర్‌వైజర్లు రాణి, మాధవి, విజయ కుమారి పాల్గొన్నారు.

భీమడోలు : భీమడోలు హైస్కూల్ వేదికగా ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమంలో భాగంగా తొలి విడతగా ఆరు రోజులపాటు జ్ఞాన జ్యోతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ సమన్వయకర్త పంకజ్‌కుమార్ తరగతులు కొనసాగుతున్న తీరును ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు భాస్కరకుమార్, శ్రీనివాసరావు, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి రామారావు, రిసోర్స్ పర్సన్లు, శరీన్, గోపాలకృష్ణ, నాగేశ్వరరావుతోపాటు అంగన్వాడీ సెక్టార్ పర్యవేక్షకులు కవిత, నూర్జహాన్ పాల్గొన్నారు.

రాజశేఖరంను గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఉభయ గోదావరి జిల్లాల ఎంఎల్‌సి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామమూర్తి తెలిపారు. మండలంలోని కేతవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, సచివాలయంలో గురువారం ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు.

జీలుగుమిల్లి :ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు కోరారు. మండలంలోని జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, బర్రింకలపాడు గిరిజన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంఎల్‌సి ఎన్నికల పరిశీలకులు విజయ్, ట్రైకర్ ఛైర్మన్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయ అధ్యాపకులకు కరపత్రాలు పంపిణీ చేశారు.

దెందులూరు : ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ కోరారు. మండలంలోని పోలీస్‌స్టేషన్, మండల అభివృద్ధి కార్యాలయం సహా పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పట్టభద్రులకు, పలు గ్రామాల్లోని పట్టభద్రులకు కరపత్రాలు అందించి, కూటమి నాయకులతో కలిసి విస్తృత స్థాయిలో ఎన్నికల ప్రచారాన్ని ఆయన గురువారం నిర్వహించారు.

నిరుద్యోగ ఐక్యవేదిక నిరసన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రోస్టర్ విధానాన్ని అమలు చేసిన తర్వాతే ఈ నెల 23న గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని నిరుద్యోగ ఐక్యవేదిక కన్వీనర్ పులవర్తి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ప్రథమ శ్రేణి జిల్లా గ్రంథాలయం వద్ద నిరుద్యోగ యువకులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నో ఆశలతో గ్రూప్-2 పరీక్షలకు సంసిద్ధమైనట్లు తెలిపారు. నిరుద్యోగ యువత ఆశలపై నీళ్లు చల్లవద్దన్నారు.

'రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలి'

ప్రజాశక్తి - చాట్రాయి

ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని ఎన్నికల నూజివీడు నియోజకవర్గ పరిశీలకులు గింజుపల్లి రమేష్ కోరారు. తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మరిడి వెంకటేశ్వరరావులతో కలిసి ఆయన మండలంలోని చాట్రాయి, చిత్తపూరు, మర్లపాలెం, పోలవరం, చిన్నంపేట, సి గుడిపాడు, చనుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో త్రివిధ ప్రకాష్, జక్కంపూడి ప్రదీప్‌కుమార్, పరసా శ్రీను, అప్పారావు, రామదాసు, నోబుల్ రెడ్డి, తల్లాడ శ్రీనివాసరావు, అందే కృష్ణప్రసాద్, బేతిన వీర రాఘవయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : కృష్ణా -గుంటూరు పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టిడిపి కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు కోరారు. గురువారం కూటమి నాయకులతో కలిసి ముదినేపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటర్లను కలిసి కరపత్రాలు అందించారు. ఈ ప్రచారంలో ఎర్ర రాంబాబు, పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.